

రీ సర్వేలో జిల్లా ప్రగతి సాధించాలి
జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - పాలకోడేరు

రీ సర్వేలో జిల్లా ప్రగతి సాధించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జెసి రీసర్వే, భూమి బదిలీ హక్కులు కల్పించడంపై, జిల్లాలోని రెవెన్యూ డివిజన్ అధికారులు, తహశీల్దార్లు, మండల సర్వే అధికారులతో మాట్లాడారు. ప్రతి రైతుకూ నోటీస్ అందించాలన్నారు. తొలి విడత రీ సర్వేలో జిల్లా మంచి ప్రగతిని సాధించిందని, రెండో విడతలో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని తెలిపారు. వేగవంతంగా రీసర్వే చేయాలని తెలిపారు. ఇప్పటికే రెండో విడత రీ సర్వేలో భాగంగా 46 గ్రామాలకు 30 నోటిఫికేషన్లు జారీ చేసినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, జిల్లా సర్వే అధికారి జాషువా, భూ విభాగం పర్యవేక్షకులు సిహెచ్.రవికుమార్ పాల్గొన్నారు.

అరకొర రుణాలు..!



- కౌలురైతులను పట్టించుకోని వైసిపి ప్రభుత్వం
- రెండు జిల్లాల్లో లక్షా 20 వేలు కౌలుకార్డులు జారీ
- బ్యాంకుల నుంచి నామమాత్రంగా పంట రుణాలు
- ఖరీఫ్ సీజన్‌లో రూ.ఆరు కోట్లే ఇచ్చినట్లు సమాచారం
- వాస్తవ సాగుదారుడైన కౌలురైతుల పరిస్థితి దారుణం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కౌలురైతుల గురించి పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. జిల్లా వ్యవసాయసాగులో దాదాపు 75 శాతం భూమిని సాగు చేస్తున్న వాస్తవ సాగుదారుడైన కౌలురైతులను చిదిమేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం రోజున మంత్రుల సందేశంలోనూ కౌలురైతుల ప్రస్తావన లేకుండాపోవడం గమనార్హం. రెండు జిల్లాల్లోనూ దాదాపు మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ సాగులో వీరిదే కీలక పాత్ర. వైసిపి ప్రభుత్వం వచ్చాక కౌలురైతుల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. 2019లో ప్రభుత్వం కౌలురైతుల చట్టంలో మార్పులు చేసి భూయజమానులకు అండగా నిలిచింది. భూయజమాని అంగీకారం లేకుండా కౌలురైతులకు రుణార్హత కార్డులు జారీ చేసేందుకు వీల్లేదన్న నిబంధన తీసుకొచ్చింది. దీంతో కౌలురైతులకు కౌలుకార్డులు జారీచేయడం సైతం గగనంగా మారింది. ఏలూరు జిల్లాలో 57 వేలు, పశ్చిమలో 60 వేల వరకూ కౌలుకార్డులు చేశారు. కార్డులిచ్చిన వారికైనా రుణాలిచ్చారా అంటే అదీ లేకుండాపోయింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకూ పశ్చిమలో దాదాపు రూ.మూడు కోట్లు, ఏలూరు జిల్లాలోనూ అదేస్థాయిలో కౌలురైతులకు రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. సాగు చేయని భూయజమానికి పంటరుణాలు మంజూరు చేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. కార్డులు జారీ చేసిన రైతులకూ బ్యాంకులు రుణాలివ్వడం లేదు. అదే సర్వే నెంబర్ భూమిపై భూయజమాని రుణం తీసుకున్నట్లు చెబుతున్నారు. దీంతో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఖరీఫ్ పెట్టుబడుల కోసం కౌలురైతులు నానావస్థలు పడుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యవసాయ సాగు చేస్తున్న పరిస్థితి నెలకొంది. పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాలకు పంటలు దెబ్బతింటే పరిహారం, రైతుభరోసా ప్రభుత్వం అందిస్తున్న ఏ సాయమూ కౌలురైతులకు అందని దుస్థితి ఉంది. దీంతో కౌలురైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కౌలురైతుల గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితి దాపురించిందనే చర్చ రైతుల్లో నడుస్తోంది.

ఇ - క్రాప్ విధానం ఎందుకో..?

ప్రభుత్వం తెచ్చిన ఇ-క్రాప్ విధానం ఎందుకో తెలియని పరిస్థితి నెలకొంది. ఇ-క్రాప్ విధానంలో సాగు చేసిన ప్రతి భూమికీ సంబంధించిన వివరాలు అధికారులు ఆన్‌లైన్ చేయాలి. సాగు చేసిన భూమి వద్దకు వెళ్లి ఏ పంట వేశారో పరిశీలించి.. సాగు ఎవరు చేస్తున్నారో నిర్ధారించి ఆ పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. అయితే ఎక్కడా అటువంటి ప్రక్రియ జరగడం లేదు. ఇ-క్రాప్‌లో కౌలురైతుల పేర్లు నమోదు చేయకుండా సాగు చేయని భూయజమాని పేరును నమోదు చేస్తున్నారు. దీంతో ధాన్యం విక్రయించే హక్కు కూడా కౌలురైతుకు లేకుండాపోయింది. వాస్తవ సాగుదారుడైన కౌలురైతును పక్కన పెట్టి సాగుకు దూరంగా ఉంటున్న భూయజమానికి లాభం చేకూర్చేలా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దీంతో కౌలురైతుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కౌలురైతులకు పంట రుణాలిచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని సాగుదారులు కోరుతున్నారు. కౌలురైతులకు ఎన్ని రుణార్హత కార్డులిచ్చారు, ఎంతమేర రుణాలు మంజూరు చేశారనే వివరాలు సైతం చెప్పని పరిస్థితి నెలకొంది. కౌలురైతుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు బట్టబయలవుతుందనే కారణంతోనే వివరాలు బయటికి చెప్పడం లేదనే చర్చ నడుస్తోంది.



ఉద్యోగులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

స్వేచ్ఛగా పని చేయడానికి గ్రీవెన్స్ తోడ్పాటు
జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగులు మరింత స్వేచ్ఛగా పని చేయడానికి ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమం తోడ్పడుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డితో కలిసి ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఉద్యోగుల నుంచి 10 వినతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఉన్న సర్వీస్ సమస్యలు పరిష్కారమైతే వారు మరింత స్వేచ్ఛాయుత వాతావరణంలో పని చేయడానికి దోహదపడుతుందన్నారు. ఉద్యోగుల సర్వీసు, పెన్షన్ సమస్యలు, ఆర్థికపరమైన అంశాలు, క్రమశిక్షణ కేసులు, మెడికల్ రీయంబర్స్‌మెంట్ సమస్యలపై ప్రతినెలా మూడో శుక్రవారం నిర్వహించే ఉద్యోగుల గ్రీవెన్స్‌లో అందజేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ విషయమై జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఆయా శాఖల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

గ్రూప్ -1లో డిఎస్‌పిగా అభిషేక్ ఎంపిక

ప్రజాశక్తి - పాలకొల్లు



అభిషేక్‌ను అభినందిస్తున్న మద్దాల వాసు

పాలకొల్లుకు చెందిన రావూరి అభిషేక్ గురువారం విడుదలైన గ్రూప్-1లో డిఎస్‌పిగా ఎంపికయ్యారు. తండ్రి చాచా సీనియర్ లాయర్‌గా, తల్లి ఉత్తమ ఉపాధ్యాయునిగా, రచయితగా ఉన్నారు. అభిషేక్ హైస్కూల్ వరకూ ఉల్లంపర్రు మాంటిస్సోరిస్‌లో, ఇంటర్ విజయవాడలోని శ్రీచైతన్య, బిటెక్, విజయవాడలోని కెఎల్ యూనివర్సిటీలో చదివారు. తరువాత న్యూఢిల్లీలో కేంద్ర హోంశాఖలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. రాష్ట్ర సర్వీస్‌లో ఇంకా ఎక్కువ మందికి సేవ చేసే భాగ్యం కోసం గ్రూప్-1 పరీక్షలు రాశారు. సివిల్స్ కూడా ప్రిపేర్ అవుతున్నారు. ఈ సందర్భంగా ఆయనను రాష్ట్ర మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు తటవర్తి కృష్ణమూర్తి, మాజీ సర్పంచి అడ్డాల వాసు, ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ డైరెక్టర్ మద్దాల వాసు, రోటరీ క్లబ్ కార్యదర్శి రావాడా సతీష్, అమలాపురం సిఐ రజనీకుమార్ అభినందించారు.

గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - భీమవరం



కలెక్టరుకు వినతిపత్రం అందజేసిన హెల్త్ సెక్రటరీలు

గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీల సమస్యలు పరిష్కరించాలని, వైద్య ఆరోగ్య శాఖలో క్షేత్రస్థాయి సిబ్బందికి అమలవుతున్న సెలవులు, సౌకర్యాలు వర్తింపజేయాలని, యాప్‌ల పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ ఎపి యునైటెడ్ విలేజ్ అండ్ వార్డు హెల్త్ సెక్రటరీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులుగా హెల్త్ సెక్రటరీలకు కూడా సదుపాయాలు కల్పించాలన్నారు. యూనిఫామ్, ఎఫ్‌టిఎ అమలు చేయాలని కోరారు. 2500 జనాభాకు ఒక ఎఎన్ఎంను నియమించాలని కోరారు. హెల్త్ సెక్రటరీలకు సెలవు కావాలంటే ఆరు శాఖల అధికారుల అనుమతి తీసుకోవాల్సి వస్తోందన్నారు. 70 రకాల యాప్‌లను ప్రతిరోజూ చేయాల్సి వస్తోందని, దీంతో క్షేత్రస్థాయి పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. హెల్త్ సెక్రటరీల నియామకమై మూడేళ్లయినా ఇప్పటికీ స్పష్టమైన జాబ్‌ఛార్టు లేక తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనియన్ జిల్లా అధ్యక్షులు భాగ్యలక్ష్మి, నాయకులు సరళ, ప్రకాష్, పి.నాగమణి, లావణ్య, సుధారాణి ఉన్నారు.

పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు
జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

పంచాయతీ ఎన్నికలు, కౌంటింగ్ ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ శాంతియుత వాతావరణంలో వివాదాలకు తావులేకుండా నిర్వహించడానికి ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఒక సర్పంచి, 10 వార్డు మెంబర్ల పదవులకు శనివారం ఉదయం 7 గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుందని పేర్కొన్నారు. ఇరగవరం మండలం కావలిపురం సర్పంచి పదవికి, వీరవాసరం మండలం మత్స్యపురి, పాలకోడేరు మండలం గొల్లలకోడేరు, పెనుగొండ మండలం దొంగరావిపాలెం, ఇరగవరం మండలం గోటేరు, పెనుమంట్ర మండలం మార్టేరు, తణుకు మండలం తేతలి, పాలకొల్లు మండలం గోరింటాడ, చింతపర్రు, పెంటపాడు మండలం కాసప పెంటపాడు, గణపవరం మండలం గణపవరం వార్డు మెంబర్ల పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం ఓటర్లు 14,735 మంది ఉన్నారని, సర్పంచి పదవికి ఇద్దరు, 10 వార్డు మెంబర్ల పదవులకు 23 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 20 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 120 మందికి ఎన్నికల విధులు కేటాయించినట్లు తెలిపారు. పోలింగ్ స్టేషన్ల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

పాలకొల్లు రూరల్: గోరింటాడ గ్రామంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను డిఎస్‌పి మనోహరాచారి పరిశీలించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, రిగ్గింగ్, ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలు జరగకుండా చూడాలని ఎన్నికల అధికారులను, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి గాని, ఓటర్లును గాని ఎవరు ఇబ్బంది పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లాలో పలు చోట్ల వర్షం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ వర్షం కురిసింది. గ్రామాల్లో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు బయటకెళ్లే మార్గం లేదు. దీంతో రహదారిపై నీరు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వర్షం కురవడంతో వ్యాపార లావాదేవీలు నిలిచిపోయాయి. జనజీవనం స్తంభించింది.

పెనుమంట్ర : మండలంలో శుక్రవారం మోస్తారు నుంచి భారీ వర్షం పడింది. ఆలమూరు, భట్లమగుటూరు, ఓడూరు, నెలమూరు, వెలగలేరు, బ్రాహ్మణచెరువు, నెగ్గిపూడి, మల్లిపూడి, జుత్తిగ, సోమరాజు ఇల్లింద్రపర్రుతో పాటు పలు గ్రామాల్లో విస్తారంగా వర్షాలు పడ్డాయి. ముఖ్యంగా పొలమూరు నుంచి నౌడూరు సెంటర్ వెళ్లే రహదారి గోతులమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

పోడూరు : మండలంలో శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మండలంలోని వద్దిపర్రు, మినిమించిలి పాడు, గుమ్మలూరు, జగన్నాధపురంలోని కాలనీ రోడ్లు జలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే చాలా రోజుల నుంచి వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించింది. కవిటం నుండి పోడూరు మీదుగా గుమ్మలూరు వచ్చే రహదారి, గుమ్మలూరు నుండి పాలకొల్లు వెళ్లే ప్రధాన రహదారి గుంతల్లో నీరు చేరి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. నిన్నటి వరకూ ఎండలతో ఉక్కబోస్తున్న ప్రజలకు ఈ వర్షంతో ఉపశమనం లభించింది. ఈ వర్షాలు పంటలకు అనుకూలంగా ఉంటాయని రైతులు ఆనందిస్తున్నారు. ఈ వర్షం వల్ల చిరు వ్యాపారులు కొద్దిగా ఇబ్బంది పడ్డారు.

పాలకొల్లు : పట్టణంలో వరుసగా 3వ రోజు శుక్రవారం కూడా వర్షం పడింది. దీంతో రోడ్లు జలమయం అయ్యాయి. ఉదయం నుంచి ఏదోఒక సమయంలో వర్షం పడుతూనే ఉంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పీపీ రోడ్డులో రాళ్లు లెగిసి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆచంట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఆర్అండ్‌బి రహదారులకు అధ్వానంగా తయారయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రయాణికులు, వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మండలంలోని ప్రధాన రహదారులు, లింకు రోడ్లు, అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. మండలంలో ఆచంట, కొడమంచిలి, కోడేరు, కందరవల్లి, కరుగోరుమిల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం తదితర గ్రామాల్లోని రహదారులు వర్షాలకు మరింత అధ్వానంగా మారాయి. పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. తక్షణం అధికారులు స్పందించి రహదారులపై నిలిచిపోతున్న వర్షపు నీటిని బయటకు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



పోడూరులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రబుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. పట్టణంలోని 2వ వార్డులో శుక్రవారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రసాదరాజు పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహదారులు, డ్రెయినేజీ, పారిశుధ్య నిర్వహణ, తాగునీరు తదితర సమస్యలపై ప్రజలు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. వాలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించాలన్నారు. అర్హత ఉండి ఇంకా సంక్షేమ పథకాలు లబ్ధి పొందని వారిని గుర్తించి వారిని కూడా లబ్ధిదారుల ఖాతాలోకి చేర్చాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో, లోటుపాట్లు సరిచేసుకొని ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలన సులభతరం చేశామని, ప్రజల గడప వద్దకే ప్రభుత్వాన్ని తీసుకొచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ జయరాజు, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు అంద్రాజు చల్లారావు, రెడ్డప్ప ధవేజీ, మల్లాడి బుజ్జి, శేఖర్, చాగంటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : ఫ్యాప్టో

ప్రజాశక్తి - భీమవరం



డిఇఒతో మాట్లాడుతున్న ఫ్యాప్టో నేతలు

ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు అందకపోవడంతో పాటు వర్క్ అడ్జస్ట్మెంట్, పనిభారం సమస్యలతో సతమతమవుతున్నారని, తక్షణం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఫ్యాప్టో జిల్లా నేతలు డిమాండ్ చేశారు. కలెక్టరేట్లో విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణకు ఫ్యాప్టో జిల్లా నేతలు సమస్యలు వివరించి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి మాట్లాడుతూ బదిలీలు జరిగి మూడు నెలలు కాకుండానే పని సర్దుబాటు చేయడం దారుణమన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పని సర్దుబాటు ప్రక్రియను విరమించుకోవాలన్నారు. సకాలంలో జీతాలు రాక పని ఒత్తిడితో ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురువుతున్నారని చెప్పారు. వినతిపత్రం సమర్పించిన వారిలో వారిలో యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామ భద్రం, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.రామచంద్రరావు, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం, డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కె.రాజశేఖర్, యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ సిహెచ్.పట్టాభిరామయ్య ఉన్నారు.

జగనన్నతోనే సంక్షేమాభివృద్ధి
ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం టౌన్



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని, 2024 ఎన్నికల్లో కూడా వైసిపి విజయం సాధించి జగన్మోహన్ రెడ్డి మరలా ముఖ్యమంత్రి అయితే సంక్షేమం ఇలాగే కొనసాగుతుందని ప్రజలకు చాటి చెప్పాలని జగనన్న సచివాలయ కన్వీనర్లు (జెసిఎస్)కు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో శుక్రవారం జరిగిన జెసిఎస్ శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవసరం ఏంటనేది ప్రజలకు వివరించి చెప్పాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి చాటిచెప్పాలన్నారు. చంద్రబాబు అధికారాన్ని అడ్డం పెట్టుకుని లక్షల కోట్లు దోచుకున్నాడని విమర్శించారు. చంద్రబాబుకు అధికారం దోచుకోవడానికి తప్ప ప్రజలకు సేవ చేయడానికి కాదన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వాలంటీరు, సచివాలయ వ్యవస్థలతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం వినూత్న కార్యక్రమమన్నారు. మన కుటుంబాల్లో పిల్లలైన వాలంటీర్లను దండుపాళ్యం బ్యాచ్ అంటూ పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను మంత్రి కొట్టు తీవ్రంగా ఖండించారు. పవన్ అసలు మనిషేనా విమర్శించారు. అసలు ఏం మాట్లాడాలో, ఏం మాట్లాడకూడదో కూడా తెలియని అజ్ఞాని పవన్ అన్నారు. ప్రతి కుటుంబంలోనూ సంతోషాన్ని నింపుతున్న సంక్షేమ పథకాలను రద్దు చేస్తానని, వాలంటీర్ వ్యవస్థను తీసివేస్తామని, సచివాలయం ఉద్యోగులను తొలగిస్తామని పవన్ కళ్యాణ్ చెప్పడం అతనిలోని అవివేకానికి నిదర్శనమన్నారు. సచివాలయ కన్వీనర్లకు, గృహ సారథులకు పార్టీ బీమా సదుపాయం కల్పిస్తుందన్నారు. ఈ నెల 18 నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకూ బీమా కోసం గృహసారథుల నమోదు జరగాలని డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్ కుమార్, పట్టణ వన్‌టౌన్ వార్డు సచివాలయాల కన్వీనర్ కొలుకులూరి ధర్మరాజు, టూటౌన్ వార్డు సచివాలయాల కన్వీనర్ కర్రి భాస్కరరావు, పెంటపాడు మండలం గ్రామ సచివాలయాల కన్వీనర్ మైలవరపు పెదబాబు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై నిరసనల వారం
సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - వీరవాసరం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ఈ నెల 30వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకూ అధిక ధరలు, స్థానిక సమస్యలపై నిరసనల వారం నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. వీరవాసరం మండల విస్తృతస్థాయి సమావేశం బొర్రా ఆలమహరాజు అధ్యక్షతన యుటిఎఫ్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు, అధిక ధరలకు వ్యతిరేకంగా గ్రామాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారంరోజుల పాటు దేశవ్యాప్త ఆందోళనకు సిపిఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా నిరసనల వారం నిర్వహిస్తున్నామన్నారు. ఒకవైపు అడ్డూఅదుపూ లేకుండా ధరలు, మరోవైపు నిరుద్యోగం విపరీతంగా పెరుగుతున్నాయని, అయినా బిజెపి ప్రభుత్వం కళ్లప్పగించి చూస్తోందని విమర్శించారు. ప్రజలపై విపరీతమైన భారాలు వేస్తూ అంబానీ, అదానీలకు దోచిపెడుతోందని విమర్శించారు. ప్రజల జీవనోపాధిని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాల కల్పనకు ఆలోచించకుండా మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టడమే బిజెపి పనిగా ఉందన్నారు. మహిళలు, చిన్నారులపైనా అత్యాచారాలు, దాడులు పెరిగిపోతుంటే వాటిని అరికట్టి రక్షణ కల్పించలేని బిజెపి సిగ్గుపడాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా ప్రజలపై విపరీతమైన భారాలు వేస్తుంటే తిరగబడతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, కేతా జ్యోతిబసు, యాళ్లబండి నారాయణమూర్తి, యాళ్లబండి మారియ్యానాయుడు, బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, పాలా కోటేశ్వరరావు, గొట్టుముక్కల శ్యాంబాబు, జుత్తిగ సాంబియాంభ, అయినంపూడి బాబూరావు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా పూడికతీత పనులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని ఒడయ్యారుపేటలో రహదారి పక్కన ఉన్న డ్రెయిన్‌లో పూడికను శుక్రవారం గ్రామస్తుల స్వచ్ఛందంగా తొలగించారు. శాలిపేట, టవర్ స్ట్రీట్ తదితర ప్రాంతాల నుంచి మురుగునీరు డ్రెయిన్ వైపు వెళ్తుంది. డ్రెయిన్ పూడుకుపోయి మురుగు పారడానికి ఆటంకంగా మారింది. అయితే గ్రామస్తులు వడయారు సంఘం ఆధ్వర్యంలో యంత్రాన్ని ఏర్పాటు చేసి పూడిక తొలగింపు పనులు చేపట్టారు.

మానవతావాది శశిరేఖ సేవలు మరువలేనివి

ఆమె మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి - ఆచంట


శశిరేఖ (ఫైల్‌ఫొటో)

ఆచంటకు చెందిన ప్రముఖ దాత, మనవతావాది నెక్కంటి శశిరేఖ (78) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆచంట గ్రామంలోని పలు దేవాలయాలకు ఆమె పెద్ద ఎత్తున విరాళాలు అందించారు. మండలంలోని పెనుమంచిలిలో ఇటీవల నిర్మించతలపెట్టిన కాపు కళ్యాణ మండపానికి 50 సెంట్ల భూమిని విరాళంగా అందించి తన దాతృత్వాన్ని నిరూపించుకున్నారు. ఆమె భర్త నెక్కంటి సూర్య వెంకట సుబ్బారావు ఆచంటలో మృత్యుంజయ కో-ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్‌గా పని చేశారు. ఆమె చిన్న కుమారుడు టిడిపిలో పలు పదవులు నిర్వహించారు. ఆమె అకాల మృతి పట్ల గ్రామస్తులతో పాటు పలువురు టిడిపి, వైసిపి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. శశిరేఖ మృతి పట్ల మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు, మాజీ సర్పంచి గొడవర్తి శ్రీరాములు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ సంతాపం వ్యక్తం చేశారు.


చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచి మంగతాయారు

చెత్త బుట్టలు అందజేత

ప్రజాశక్తి - వీరవాసరం

ఇంటింటికి చెత్త సేకరణలో భాగంగా ప్రభుత్వం ఉచితంగా అందించే చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమాన్ని వీరవాసరంలో సర్పంచి చికిలే మంగతాయారు శుక్రవారం ప్రారంభించారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా చెత్త సేకరణ వాహనాలకు అందించేందుకు ప్రతి ఇంటికి రెండు బుట్టల చొప్పున అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు బుంగా లక్ష్మి, నూకల కనకారావు, బోను పైడియ్య, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంపిపి సూర్యకుమారి వ్యాఖ్యలు హాస్యాస్పదం

ఎఎంసి చైర్‌పర్సన్ లావణ్య

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి మండల పరిషత్ నిధులతో చేస్తున్న అభివృద్ధి పనులను తాను సొంత ఖర్చులతో చేస్తున్నట్లు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఎఎంసి చైర్‌పర్సన్ చిల్లే లావణ్య అన్నారు. ఎఎంసి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి చేస్తామని ఎంపిపి సూర్యకుమారి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 2014 నుంచి 2019 వరకు ఎంత అభివృద్ధి చేశారో ప్రజలకు తెలుసన్నారు. వైసిపి ప్రభుత్వం ఇచ్చిన నిధులతో అభివృద్ధి చేస్తూ సొంత ఖర్చులతో చేసినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకరించకపోతే అభివృద్ధి సాధ్యం కాదన్నారు. ఆయన గ్రామాల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతారన్నారు. ఆచంటలో నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తూ వారికి ఉచితంగా ఇళ్ల స్థలాలను వైసిపి ప్రభుత్వం అందించిందన్నారు. టిడిపి నాయకులు పిచ్చి ప్రేలాపనలతో అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఈ సమావేశంలో సర్పంచులు కోట సరోజిని, గణేశుల శేషవాణి, దిరిశాల విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కుమారునిపై తండ్రి కత్తితో దాడి

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం టౌన్

అప్పు ఎందుకు చేశావని ప్రశ్నించిన కుమారునిపై అతని తండ్రి కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో గాయాలపాలైన కుమారుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన మండలంలోని జగ్గన్నపేటలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జగ్గన్నపేట గ్రామానికి చెందిన బెజవాడ పల్లయ్య భార్య గతంలోనే మృతి చెందింది. ఈ క్రమంలో పల్లయ్య ఆయన కుమాడురు, కోడలికి కూడా చెప్పకుండా రూ.మూడు లక్షలు అప్పులు చేసి తన కుమార్తెకు ఇచ్చాడు. దీంతో తండ్రీ కొడుకుల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో అప్పులు చేయడం ఏంటని రవి తన తండ్రి పల్లయ్యను గురువారం రాత్రి నిలదీయడంతో ఇద్దరు గొడవ పడ్డారు. పల్లయ్య చాకులాంటి ఆయుధంతో రవి నడుంపై దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన రవిని అంబులెన్సులో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు తరలించారు. రూరల్ ఎస్‌ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.



బియ్యాన్ని పట్టుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు

150 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లారీలో అక్రమంగా రవాణా చేస్తున్న 150 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మండలంలోని దిగమర్రు బైపాస్ రోడ్డు చెక్‌పోస్టు సమీపంలో సివిల్ సప్లై డిటి ఐవివి.సత్యనారాయణ శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. బియ్యంతో పాటు 50 కేజీల పాలిథిన్ కవర్లు పట్టుకున్నట్లు ఆయన చెప్పారు. వీటి విలువ రూ.2.25 లక్షలు ఉంటుందని తెలిపారు. బియ్యం స్వాధీనం చేసుకుని పాలకొల్లు ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద జాగ్రత్త పరిచి కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన బియ్యం యాజమని మామిడి సాయిబాబు, డ్రైవర్ ఆర్.నాగరాజులపై కేసు నమోదు చేశామని డివిజనల్ సివిల్ సప్లై అధికారి ఎం.రవిశంకర్ తెలిపారు. ఈ దాడిలో అటెండర్లు జి.వీరభద్రపరమేశ్వరరావు, కె.భోగయ్య పాల్గొన్నారు.

ప్రత్యూష ప్రతిభ

గ్రూప్-1 పరీక్షల్లో తొలి ర్యాంకు
మనపై మనకు నమ్మకమే ఆయుధం
గణేశ్న భాను శ్రీలక్ష్మీఅన్నపూర్ణ ప్రత్యూష


తల్లిదండ్రులతో ప్రత్యూష

ప్రజాశక్తి - కాళ్ల

పటిష్టమైన పునాది.. మనపై మనకు నమ్మకం ఉంటే ఎంతటి లక్ష్యాన్ని అయినా సులువుగా సాధించవచ్చని గణేశ్న భాను శ్రీలక్ష్మీఅన్నపూర్ణ ప్రత్యూష అన్నారు. మండలంలోని సీసలి గ్రామానికి చెందిన ప్రత్యూష ఎపిపిఎస్‌సి గ్రూప్-1 పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపారు. 22 ఏళ్ల వయస్సులో గ్రూప్-1 పరీక్షలో తొలి ప్రయత్నంలోనే మొదటి ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి గణేశ్న వెంకట రామాంజనేయులు భీమవరం మండలం డిఇఒ కార్యాలయంలో ఎపిఒగా పని చేస్తున్నారు. తల్లి ఉష గృహిణి. వీరికి ప్రత్యూష ఒక్కరే సంతానం. ఆమె ఇంటర్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారు. ఢిల్లీలో పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్‌లో డిగ్రీ చేశారు. ప్రస్తుతం సివిల్స్ మె యిన్స్‌కు సిద్ధమ వుతున్నారు. ఎ పిపిఎస్‌సి గ్రూప్-1లో తొలి ర్యాంకు రావడంతో ఆమె తల్లిదండ్రులు రామాంజ నేయులు, ఉష, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

తండ్రి ప్రోత్సాహంతో...

"నన్ను కలెక్టర్‌గా చూడాలన్నది నా తండ్రి కల. ఇంజినీరింగ్ వంటి కోర్సులకు బదులుగా ఢిల్లీకి పంపి బిఎలో చేర్పించారు. డిగ్రీ పూర్తవ్వగానే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా నా తండ్రి ప్రోత్సహించారు. ఢిల్లీలో నాతో పాటు మా అమ్మ ఉంటుంది. తండ్రి ప్రోత్సాహం వల్లే ఈ విజయం సాధించాను. ఏడాది పాటు ఢిల్లీలో ఉంటూ ఎపిపిఎస్‌సి గ్రూప్-1 పరీక్షలకు సిద్ధమయ్యాను. నా తండ్రి సూచనతోనే ఈ పరీక్ష రాశాను. ఫిలిమ్స్ పరీక్ష యుపిఎస్‌సి స్థాయిలో ఇవ్వడంతో సులువైంది. మెయిన్స్ మాత్రం ప్రత్యేకంగా సిద్ధమయ్యా. మెయిన్స్ ఫలితాలు తర్వాత నమూనా ముఖాముఖికి హాజరై తర్ఫీదు తీసుకున్నారు. ముఖాముఖిలో అభ్యర్థుల అభిప్రాయాల ఆధారంగానే ఎక్కువ ప్రశ్నలు అడిగారు" అని ప్రత్యూష తెలిపారు.

నా లక్ష్యం సివిల్స్

గణేశ్న భాను శ్రీలక్ష్మీ అన్నపూర్ణ ప్రత్యూష, సీసలి



లక్ష్య సాధనకు పటిష్టమైన పునాదే ఎంతో కీలకం. ఎపిపిఎస్‌సి గ్రూప్-1 మా నాన్న కల. భవిష్యత్తులో సివిల్స్‌కు ప్రయత్నిస్తా. ఇప్పటికే సివిల్స్ ఫిలిమ్స్ రాశాను. సెప్టెంబర్‌లో మెయిన్స్ రాయాల్సి ఉంది.

విధిగా హెల్మెట్ ధరించాలి

ఎస్‌పి రవిప్రకాష్

ప్రజాశక్తి - ఉండి

ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో విధిగా హెల్మెట్‌ను ధరించాలని జిల్లా ఎస్‌పి ఉప్పాడ రవిప్రకాష్ అన్నారు. మండల కేంద్రమైన ఉండి మెయిన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న హెల్మెట్ డ్రైవ్‌ను ఎస్‌పి రవిప్రకాష్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం రోడ్డు ప్రమాదాల్లో 116 మంది మృతి చెందారన్నారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల మరణాలు తగ్గాయని, సుమారు 83 మంది మృత్యువాత పడ్డారని చెప్పారు. జిల్లాలో పోలీసులు నిర్వహిస్తున్న హెల్మెట్ డ్రైవ్ వల్ల సుమారు 80 శాతం మంది హెల్మెట్ ధరించడం ఆనందదాయకమన్నారు. హెల్మెట్ ధరించకుండా మితిమీరిన వేగంతో వాహనదారులు ప్రయాణిస్తున్నారని, వారిని నిలువరించి వారికి హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించడం తమ బాధ్యత అని చెప్పారు. స్థానికంగా ప్రయాణించే వారు కూడా హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని ఆయన సూచించారు. రోడ్డు నియమ నిబంధనలు పాటిస్తూ వాహనదారులు, ప్రయాణికులు పోలీసులకు సహకరించాలన్నారు. ద్విచక్రవాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉండి ఎస్‌ఐ కొప్పిశెట్టి గంగాధరరావు, ఎఎస్‌ఐ సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్ డి.యేసయ్య, కానిస్టేబుల్ వెంకటరత్నం పాల్గొన్నారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం

ప్రజాశక్తి - ఉండి

పదో తరగతి ఫలితాల్లో పాఠశాల స్థాయిలో ప్రథమ స్థాయిలో నిలిచిన విద్యార్థినికి గొర్తి ఫౌండేషన్ వారు నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.స్రవంతి పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఆ విద్యార్థినికి గొర్తి ఫౌండేషన్‌కు చెందిన భానుమూర్తి శుక్రవారం రూ.పది వేల చెక్కును నగదు ప్రోత్సాహకంగా అందించారు. ఈ సందర్భంగా భానుమూర్తి మాట్లాడుతూ విద్యార్థులందరూ స్రవంతి స్ఫూర్తితో మెరిట్ సాధించాలని చెఆప్పరు. ప్రతి సంవత్సరం ఇదే విధంగా మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందిస్తామని తెలిపారు.

ఎస్‌ఆర్‌కెఆర్ విద్యార్థికి మెరిట్ స్కాలర్‌షిప్

ప్రజాశక్తి - భీమవరం రూరల్


ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇసిఇ ఫైనలియర్ విద్యార్థి సాయిశంకర్‌కు వాడపల్లి వి.రామకృష్ణ మెమోరియల్ మెరిట్ స్కాలర్‌షిప్ రూ.పది వేలు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు అందించారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో నగదు బహుమతి చెక్కును విద్యార్థికి అందించారు. ఈ సందర్భంగా ఇసిఇ హెడ్ డాక్టర్ ఎన్.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ తమ కళాశాలలో 2003 - 2007 బ్యాచ్ ఇసిఇ విద్యార్థులు వికలాంగులైన తమ స్నేహితుడు రామకృష్ణ పేరిట ఈ మెరిట్ స్కాలర్‌షిప్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఏడాది మూడో సంవత్సరం పూర్తయ్యేనాటికి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి ఈ నగదు బహుమతిని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.

వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి - ఉండి

ఉండి రైల్వే గేటు సుమారు 30 నిమిషాల పాటు పడడంతో ప్రయాణికులు వర్షంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం రాత్రి రైల్వే గేటు పడడం దానికి తోడు వర్షం పడడంతో తలదాచుకోవడానికి స్థలం దొరక్క వర్షంలోనే నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రయాణికులు, వాహనదారులు, వృద్ధులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 108 అంబులెన్స్ సైతం సుమారు 30 నిమిషాల పాటు ట్రాఫిక్‌లోనే ఇరుక్కుపోయింది. భీమవరం ఆకివీడులలో గూడ్స్ రైళ్ల ప్రారంభమయ్యే సమయానికి ఉండిలో రైల్వే గేటు వేస్తున్నారని సుమారు 20 నిమిషాల పాటు వేసవిలో ఎండల్లో వర్షాకాలంలో వర్షంలో నిలబడాల్సి వస్తుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ నిడదవోలు రైల్వే డబ్లింగ్ లైన్‌ను కేవలం గూడ్స్ రైళ్ల కోసమే వేశారా అని పలువురు ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

డిఇఒ వెంకటరమణకు గొరగనముడి వాసుల సత్కారం


డిఇఒకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గొరగనముడి వాసులు

ప్రజాశక్తి - పాలకోడేరు

స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా విద్య శాఖాధికారి ఆర్.వెంకటరమణను గొరగనముడివాసులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. వరుసగా మూడో సారి జిల్లా ఉత్తమ సేవ అవార్డు అందుకున్న డిఇఒకు గొరగనముడికి చెందిన ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ, మాజీ సర్పంచి చెల్లబోయిన పాపారావు, వైసిపి నాయకులు దిడ్ల రవి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరుసగా మూడు సార్లు ఉత్తమ సేవా అవార్డు రావడం అభినందనీయమన్నారు. మంచితనానికి మారుపేరుగా అంకిత భావంతో జిల్లా విద్యాభివృద్ధికి కృషి చేయడం గొప్ప విషయమన్నారు. అనంతరం డిఇఒ మాట్లాడుతూ జిల్లాలో నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేసినందుకు, బెస్ట్ అవైలబుల్ స్కూల్ ఫ్రీ సీట్లను రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాకు 2400 మందికి కార్పొరేట్ స్కూళ్లలో ఫ్రీ సీట్లు కేటాయించినందుకు ఉత్తమ సేవా అవార్డు లభించిందని చెప్పారు. ఈ అవార్డు మరింత బాధ్యత పెంచిందని తెలిపారు.

పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన డిపిఒ మల్లికార్జునరావు

ప్రజాశక్తి - పాలకోడేరు

పంచాయితీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జునరావు తెలిపారు. మండలంలోని గొల్లలకోడేరులో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓట్ల లెక్కింపులో పొరపాట్లకు తావులేకుండా పక్కా ఏర్పాట్లు చేశామన్నారు. ఓట్ల లెక్కింపులో ఒకటికి, రెండు సార్లు పరిశీలించుకోవడంతోపాటు, పోటీలో ఉన్న అభ్యర్థుల అభ్యర్థనలను పరిగణలోనికి తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు చర్యలు తీసుకోవాలన్నారు. డిపిఒతో పాటు ఎన్నికల అధికారులు శివకృష్ణ, రమాలిలా ఉన్నారు.


కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిపిఒ

ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం : ఎంఎల్‌ఎ గ్రంధి


గ్రంధికి పుష్పగుచ్ఛం అందిస్తున్న దళిత ఐక్యవేదిక నాయకులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని, ఇందులో భాగంగా గ్రామాలను, పట్టణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం నియోజకవర్గంలో దళిత, దళిత క్రైస్తవ ప్రాంతాల్లో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను దృష్టిలో పెట్టుకొని దళిత ఐక్యవేదిక నాయకులు ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ గత నాలుగేళ్ల పాలనలో భీమవరం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను చేశామని తెలిపారు. ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ప్రతి కుటుంబానికి మేలు జరగాలని, ప్రతి ప్రాంతం అభివృద్ధి కావాలనే నినాదంతో సిఎం జగన్ పాలన చేస్తున్నారన్నారు. అర్హులందరికీ నవరత్న పథకాలను అమలు చేస్తూ ఎన్నికల్లో ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్‌కుమార్, పాలపర్తి జోనా, పట్టెం సుభాకర్, ఆలమూరి బాబ్జి, ఏలేటి సునీల్‌కుమార్, ఆచంట ఆనంద్‌కుమార్, గొల్లా రాజ్‌కుమార్, తాటిపాక సుభాకర్, ఉండ్రు విల్సన్ పాల్గొన్నారు.

మార్టేరులో పార్సిల్, కార్గో సర్వీస్ ప్రారంభం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరులో పాలకొల్లు రోడ్డులోని సాయిబాబా ఆలయం ఎదురుగా భారత్ పెట్రోల్ బంకు పక్కన ఆర్‌టిసి ఆధ్వర్యంలో పార్సిల్, కార్గో సర్వీస్‌ను మానవత సంస్థ జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. నరసాపురం డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి మాట్లాడుతూ మార్టేరు కేంద్రంగా ఇతర రాష్ట్రాల్లో ఉన్న చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లో ఎంజిబిఎస్, సిబిఎస్, కెపిహెచ్‌బి, బిహెచ్‌ఇఎల్ వంటి నగరాలు, ప్రాంతాలకు కొరియర్ సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్టేరు పంచాయతీ ఉప సర్పంచి కర్రి వేణుబాబు, పడాల జగన్నాథ్‌రెడ్డి, చిర్ల శ్రీనివాస్‌రెడ్డి, కడలి సుబ్రహ్మణ్యం, ముని బాబు పాల్గొన్నారు.


పార్శిల్, కార్గో సర్వీస్ ప్రారంభిస్తున్న సుబ్బన్నరెడ్డి

విద్యార్థులకు దంత పరీక్షలు


విద్యార్థులతో మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థులు దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఉదయం, సాయంత్రం కూడా బ్రష్ చేసుకోవాలని మానవత సంస్థ జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి అన్నారు. పెనుమంట్ర గౌతమి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపల్, కరస్పాండెంట్ ఎం.జగదీష్ అధ్యక్షతన పెనుగొండ ఇన్నర్ వీల్ క్లబ్, పాలకొల్లు లయన్స్ క్లబ్, మానవత సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో పెనుగొండ రత్నాస్ దంత వైద్య నిపుణులతో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు మేడపాటి మురళి జోగిరెడ్డి, షాలిని రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండలాధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు, మాజీ మండల అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యం, అంబులెన్స్ డ్రైవర్ శ్రీనివాస్, గ్రామ ప్రముఖులు తమనంపూడి రామారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం టౌన్

తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో గతంలో కొంతకాలం పాటు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేసి జీతభత్యాలు రాక ఇబ్బంది పడుతున్న పలువురికి ఉప ముఖ్యమంత్రి, దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శుక్రవారం జీతాల చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా నియామకాలు పొందిన 11 మంది పేర్లు జాబితాలో నమోదు కాకపోవడంతో వారికి జీతాలు రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. కరోనా సమయంలోనూ వీరంతా ప్రాణాలకు తెగించి సేవలందించారన్నారు. అలాంటి వారిని ఏజెన్సీ గాలికి వదిలేయడంతో ప్రభుత్వం బాధ్యత తీసుకుని ఆసుపత్రి నిధుల నుంచి జీతభత్యాలు చెల్లించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వీరి సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో తాను ముఖ్యమంత్రితో మాట్లాడి ఆసుపత్రి నిధుల నుంచి జీతభత్యాలు ఇచ్చేలా చేశామని చెప్పారు. తాడేపల్లిగూడెం ప్రాంతంలో గతంలో ట్రాక్టర్ తిరగబడి ఇద్దరు మృతి చెందగా రూ.ఐదు లక్షల చొప్పున పరిహారం ఇచ్చారని, కడియాద్ద బాణసంచా పేలుళ్లలో నలుగురు ప్రాణాలు కోల్పోగా ఒక్కో కుటుంబానికి రూ.పది లక్షల పరిహారం అందించారన్నారు. ప్రస్తుతం జీతాలు చెల్లిస్తున్న వీరికి భవిష్యత్తులో అవకాశాన్ని బట్టి ఉద్యోగాలు ఇస్తామన్నారు. జిల్లా డిసిహెచ్‌ఎస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పగడాల సూర్యనారాయణ మాట్లాడుతూ ఆసుపత్రిలో సేవలందించిన 11 మందిని ఏజెన్సీ గాలికి వదిలేయడంతో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దృష్టికి తీసుకురాగా ఆయన చొరవతో వారికి జీతాలు చెల్లించినట్లు తెలిపారు. 11 మందిలో తొమ్మిది మంది అర్హత సాధించారని, వారికి ఏడాది పాటు రూ.10,34,500 జీతాలుగా చెల్లిస్తున్నామన్నారు. వచ్చే ఫిబ్రవరిలో మరో విడత చెల్లిస్తామన్నారు. ఈ సందర్భంగా జీతాలు అందుకున్న వారు మంత్రి కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ జీతాల కోసం తామెంతో కాలంగా ఎదురు చూస్తున్నామని, తమ సమస్యను అర్థం చేసుకొని జీతాలు ఇప్పించిన ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మేలు తాము జీవితంలో మరువలేమని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కర్రి భాస్కరరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ జిఆర్.రెడ్డి, కొలుకులూరి ధర్మరాజు, టిఎల్‌ఎఫ్ ప్రెసిడెంట్ బోలెమ్ రామలక్ష్మి, వైసిపి యువ నాయకులు కొట్టు విశాల్ పాల్గొన్నారు.

బిసిలకు అన్యాయం చేసిన జగన్

మాజీ మంత్రి పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

బిసిలకు ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా ఆర్థిక రుణ సంక్షేమ అభివృద్ధి ఫలాలను అందిస్తానని సిఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా బిసిలకు అన్యాయం చేశారని టిడిపి రాష్ట్ర పొలిట్ సభ్యులు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ విమర్శించారు. స్థానిక భీమవరం పట్టణం ఆనంద ఫంక్షన్ హాలులో శుక్రవారం శెట్టిబలిజ గౌడ శ్రీ శయన బిసి కులాల సాధికార కమిటీ ఆత్మీయ సమావేశం శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుడుపూడి సత్తిబాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి బిసిలకు చెందిన నాయకులకు రాజకీయ లబ్ధి చేకూర్చి బిసిల సంక్షేమ అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. సభా ప్రారంభికులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సమావేశంలో బిసిలకు అమలు చేయాల్సిన సంక్షేమ పథకాలు, నామినేటెడ్ పదవుల గురించి కులంకుషంగా చర్చించి తీర్మానాన్ని రాష్ట్ర పార్టీకి పంపనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడిపూడి సత్తిబాబు, శ్రీ శయన సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ అమర్నాథ్ గౌడ్, గౌడ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ చనుమోలు అశోక్‌గౌడ్, ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి శివరామరాజు, టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామాంజనేయరాజు, తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, దాసరి ఆంజనేయులు, దాసరి శ్యామ్ చంద్రశేషు, కాగిత కృష్ణప్రసాద్, శెట్టిబలిజ గౌడ సాధికార కమిటీ జిల్లా కన్వీనర్లు కడలి మోహన్, వీరమల్లు సూరిబాబు, శెట్టిబలిజ గౌడ రాష్ట్ర కమిటీ సభ్యులు బొక్క సూరిబాబు పాల్గొన్నారు.

కోమటిగుంటలో అన్నసమారాధన

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కోమటిగుంట గ్రామంలో శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. విజయ కనకదుర్గ అమ్మవారికి శ్రావణ మాసం సందర్భంగా మొదటి శుక్రవారం కావడంతో పట్టు చీరలతో ప్రత్యేక అలంకరణ చేశారు. 150 పట్టుచీరలతో ప్రత్యేక అలంకరణ చేశారు. యాత్రికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు. మూడు వారాలు శ్రావణ శుక్రవారం పూజలు, ప్రత్యేక అలంకరణలు, అన్న సమారాధనలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.